# రాష్ట్రంలో రాక్షసపాలన

- రావణకాష్టంగా మార్చిన రేవంత్ సర్కార్
- చెంచు మహిళపై పాశవిక దాడి దారుణం
- ఈ ఘటనపై సీఎం రేవంత్ స్పందించాలి
- మాజీ మంత్రులు సత్యవతి, సబిత, మాజీ ఎమ్మెల్యేల డిమాండ్
- ఈశ్వరమ్మకు పరామర్శ
- 1.5 లక్షల ఆర్థిక సాయం అందజేత



ఈశ్వరమ్మను పరామర్శిస్తున్న మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్

నాగర్‌కర్నూల్, జూన్ 22 : రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మారుస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. అఘాయిత్యానికి గురై నాగర్‌కర్నూల్ దవాఖానలో చికిత్స పొందుతున్న కొల్లాపూర్ మండలం మొలచింతపల్లికి చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మను శనివారం వారు పరామర్శించారు. ఆమెతో మాట్లాడి కొండంత ధైర్యాన్ని ఇచ్చారు. ఆమెకు రూ.1.5 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. మెరుగైన వైద్య సేవల అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. చెంచు మహిళపై పాశవిక దాడి జరగడం అత్యంత బాధాకరమని అన్నారు. మహిళా డాక్టర్ పర్యవేక్షణలో ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. డ్యూటీ డాక్టర్లతో నామమాత్రంగా వైద్యసేవలు అందించడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాపాలన జరగడం లేదని, రాక్షస పాలన కొనసాగుతున్నదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. దాడులను నియంత్రించడంలో అధికారులు, పోలీసులు పూర్తిగా విఫలమవుతున్నారని దుయ్యబట్టారు. ఈ దాడిపై సీఎం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. మొలచింతపల్లి ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇంతటి దుశ్చర్యకు పాల్పడిన మరో ముగ్గురిని సైతం అరెస్టు చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ తరఫున బాధితులకు అండగా ఉండేందుకు సీఎస్, డీజీపీతో మాట్లాడుతామని వారు తెలిపారు.

## చెంచు మహిళకు 2 లక్షల ఎక్స్‌గ్రేషియా

- ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండ
- బాధితురాలిని పరామర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, జూన్ 22 : అఘాయిత్యానికి గురై నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న మొలచింతలపల్లి చెంచు మహిళ ఈశ్వరమ్మను శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఆమెకు భరోసానిచ్చారు. మహిళపై జరిగిన దాష్టీకాన్ని హేయమైన చర్యగా అభివర్ణించారు. నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఘటన జరిగిన వెంటనే స్పందించామని, ఎస్పీతోపాటు ఇతర పోలీస్ అధికారులకు ఫోన్‌చేసి నిందితులను అరెస్టుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆమె ముగ్గురు పిల్లలకు గురుకుల విద్యను అందిస్తామని, కుటుంబంపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని ధైర్యం చెప్పారు.

## రాష్ట్రంలో 40 ఎకో టూరిజం స్పాట్లు

- అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ



ఎకో టూరిజం సమావేశంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 12 సర్క్యూట్‌లలో 40 ఎకో టూరిజం స్పాట్లను గుర్తించినట్టు అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. శనివారం సచివాలయంలోని అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఎకో టూరిజం కన్సల్టేటివ్ కమిటీ ఉన్నతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. అడ్వెంచర్, రిక్రియేషన్, ఆధ్యాత్మిక, వారసత్వ, సినీ, వెడ్డింగ్, నేచర్ వైల్డ్‌లైఫ్, హెరిటేజ్-కల్చర్ తదితర అంశాల ఆధారంగా మరిన్ని ప్రాంతాలను గుర్తించి వాటిని ఎకో టూరిజం స్పాట్లుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం పాలసీ రూపకల్పనలో అటవీ, దేవాదాయ, రెవెన్యూ, పర్యాటకశాఖలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ టూరిజం స్పాట్ల అభివృద్ధికి పబ్లిక్-ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో నిధులను సమీకరించాలని ఆదేశించారు. సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్, పీసీసీఎఫ్ (వైల్డ్‌లైఫ్) పర్గెయిన్ తదితరులు పాల్గొన్నారు.

### ఆషాఢ బోనాల నిర్వహణకు 20 కోట్లు

ఈ ఏడాది ఆషాఢ బోనాల నిర్వహణకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.20 కోట్లను మంజూరు చేశారని దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. శనివారం తన చాంబర్‌లో జీహెచ్‌ఎంసీ పరిధిలోని దేవాదాయ శాఖ కమిషనర్లతో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా తనతోపాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, డీ శ్రీధర్‌బాబు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యులుగా, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి కన్వీనర్‌గా బోనాల ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇతర ప్రధాన ఆలయాలకు ఉత్సవ కమిటీల ఎంపిక ప్రక్రియ రెండు మూడు రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు.

## పార్కింగ్ సమస్యకు ఏఐతో చెక్

**ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలి: శ్రీధర్‌బాబు**



హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌తో పాటు అన్ని నగరాల్లో పార్కింగ్ సమస్యను పరిష్కరించడానికి కృత్రిమ మేధను ఎలా ఉపయోగించుకోవాలన్న దానిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. శనివారం సచివాలయంలోని తన చాంబర్‌లో 'ఈజీ పార్క్ ఏఐ' సంస్థ డిజిటల్ ప్రెజెంటేషన్‌ను మంత్రి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పార్కింగ్ కోసం ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నాయి. మనం కూడా ఆ దిశగా కృషి చేద్దాం. ఒక్క హైదరాబాద్‌లోనే దాదాపు 14 లక్షల ఫోర్ వీలర్లు, 70 వేల క్యాబ్‌లు, దాదాపు లక్ష ఆటోలు ఉన్నాయి. కాబట్టి కృత్రిమ మేధ ద్వారా రద్దీ ప్రాంతాలను గుర్తించడం, పార్కింగ్ కోసం దీన్ని వినియోగించుకోవడంపై దృష్టిసారించాలి. అవసరమున్న చోట మల్టీ లెవెల్ పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. పార్కింగ్ స్లాట్‌ను ముందే బుక్ చేసుకునేందుకు యాప్‌లను రూపొందించాలి' అని పేర్కొన్నారు.

## ఆయిల్‌పామ్‌కు కనీస ధర 15 వేలు ఇవ్వాలి

- కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



హైదరాబాద్, జూన్ 22(నమస్తే తెలంగాణ): ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహించేందుకు కనీస ధర టన్నుకు రూ.15 వేలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం కేంద్రానికి లేఖ రాశారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు రూ.13,438గా ఉందని తెలిపారు. వయబులిటీ ధర నిర్ణయించేందుకు గానూ కేంద్ర ప్రభుత్వం అధిక నూనె శాతం వచ్చే తెలంగాణను పరిగణలోకి తీసుకోకుండా తక్కువ నూనె శాతం వచ్చే ఏపీని పరిగణలోకి తీసుకున్నదని ఆరోపించారు.


## జనాభా నిష్పత్తి ప్రకారం నిధులివ్వాలి

- సీఎస్‌ఎస్ పథకాలకు వర్తింపజేయాలి
- 'పునర్విభజన' బకాయిలు విడుదల చేయాలి
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలి
- కేంద్రానికి డిప్యూటీ సీఎం భట్టి విన్నపాలు



హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్‌ఎస్) నిధులను జనాభా నిష్పత్తి ప్రకారం ఇవ్వాలని, పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని, రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన శనివారం ఢిల్లీలో జరిగిన కేంద్ర బడ్జెట్ సన్నాహక సమావేశంతోపాటు జీఎస్టీ కౌన్సిల్ 53వ సమావేశంలో భట్టివిక్రమార్క తెలంగాణకు రావాల్సిన నిధులతోపాటు పలు అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రాలకు అందించే ప్రత్యేక ఆర్థిక సాయాన్ని రూ.2.5 లక్షల కోట్లకు పెంచాలని కోరారు. స్వరాష్ట్రంగా ఏర్పాటైన తెలంగాణకు మొదటి సంవత్సరంలో మంజూరైన రూ.495.21 కోట్ల సీఎస్‌ఎస్ గ్రాంట్లను పొరపాటుగా ఏపీకి విడుదల చేశారు. ఈ మొత్తాన్ని కేంద్రం ద్వారా తిరిగి తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## లోకం పోకడ




## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| మెదక్ | 36.5°c | 23.1°c |
| రంగారెడ్డి | 36.1°c | 22.2°c |
| ఆదిలాబాద్ | 36.0°c | 23.7°c |
| నిజామాబాద్ | 35.7°c | 23.9°c |
| మహబూబ్‌నగర్ | 35.6°c | 28.4°c |
| నల్లగొండ | 35.0°c | 23.8°c |
| హైదరాబాద్ | 33.0°c | 24.9°c |
| ఖమ్మం | 32.0°c | 26.0°c |
| వరంగల్ | 32.0°c | 25.0°c |
| కరీంనగర్ | 31.0°c | 26.0°c |

## రాహుల్‌కు లేఖలో రక్తపు సంతకం

- మీ హామీలు కూడా నీటిపై రాతలేనా?
- జాబ్ క్యాలెండర్ ప్రకటన ఏమైంది?
- 6 నెలలు దాటినా హామీలు అమలుకావా?
- రక్తంతో రాహుల్‌గాంధీకి నిరుద్యోగుల లేఖ

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వంపై నిరుద్యోగుల కోపం కట్టలు తెంచుకున్నది. ఎన్నికల హామీలను అమలుచేయకపోవటంతో అసహనం వ్యక్తమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు చేసినా రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకపోవటంతో నిరుద్యోగులు కాంగ్రెస్ అధిష్ఠానంతో పోరుకు సిద్ధమయ్యారు. రాహుల్‌గాంధీ స్వయంగా హైదరాబాద్‌కు వచ్చి నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీస్తున్నారు. మీ (రాహుల్ గాంధీ) హామీలు కూడా నీటిపై రాతలేనా? అని మండిపడుతున్నారు. వంద రోజుల్లో ప్రకటిస్తానన్న జాబ్ క్యాలెండర్ ప్రకటన ఏమైంది? గ్రూప్ పోస్టులను పెంచుతామన్న హామీ ఏమైంది? అని నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడి ఆరు నెలలు దాటినా హామీలు అమలు చేయరా? నిరుద్యోగులకు మీరిచ్చే విలువ ఇదేనా? అని ప్రశ్నించారు. నిరుద్యోగులు రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. 'అసెంబ్లీ ఎన్నికల సమయంలో హైదరాబాద్, అశోక్‌నగర్, సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని అన్నారు. గ్రూప్-2 పోస్టుల సంఖ్యను 183 నుంచి 2,000కు, గ్రూప్-3 పోస్టుల సంఖ్యను 1,365 నుంచి 3,000కు పెంచి నిరుద్యోగులకు న్యాయం చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా జాబ్ క్యాలెండర్, పోస్టుల పెంపు విషయంలో స్పందన రాలేదు. మీరు స్వయంగా వచ్చి నిరుద్యోగులకు ఈ హామీలు ఇచ్చినందున న్యాయం చేస్తారని ఆశిస్తున్నాం' అని లేఖలో రక్తపు సంతకం చేశారు.

## హెల్త్ విభాగంలోని అన్ని పోస్టులను భర్తీ చేయాలి

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): హెల్త్ విభాగంలోని అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేసి, ఆయా సంస్థలను బలోపేతం చేయాలని అధికారులను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ తనిఖీలు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. హైదరాబాద్ నాచారంలోని ఫుడ్ సేఫ్టీ ల్యాబ్, తెలంగాణ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలను బలోపేతం చేయాలని, వాటిల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధుల నిర్మూలనకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల విడుదలకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమీక్షలో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శివలీల, ఉన్నతాధికారులు దేవేందర్‌కుమార్, సురేందర్‌రెడ్డి ,జగదీశ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో హెల్త్ టూరిజం హబ్

- వెయ్యి ఎకరాల్లో ఏర్పాటుకు ప్రణాళిక
- అన్ని వైద్యసేవలనూ ఒకే గొడుగు కింద అందిందించేందుకు కృషి
- రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో ఏపీ సీఎం చంద్రబాబుతో పోటీ పడతా
- బసవతారకం క్యాన్సర్ దవాఖాన వ్యవస్థాపక వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి



బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 24 వ వ్యవస్థాపక వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.

జూబ్లీహిల్స్, జూన్ 22: ప్రపంచదేశాలతో పోటీపడే విధంగా హైదరాబాద్‌లో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటుచేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. దేశ ప్రజలతో పాటు విదేశాల నుంచి వచ్చే వారికి సైతం అన్ని రకాల నాణ్యమైన వైద్య సేవలు ఒకే గొడుగు కింద అందేలా వెయ్యి ఎకరాల్లో హెల్త్ హబ్ ఏర్పాటుచేస్తామని చెప్పారు. బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ 24వ వ్యవస్థాపక వేడుకలు శనివారం జరిగాయి. ఈ వేడుకను హాస్పిటల్ చైర్మన్, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ బాధతో మరొకరు మరణించవద్దన్న దృఢ సంకల్పంతో 24 ఏండ్లక్రితం ఎన్టీఆర్ నాటిన ఈ చిన్నమొక్క మహావృక్షంగా మారి లక్షలమంది క్యాన్సర్ రోగులకు నీడనివ్వడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఎన్టీఆర్ కుటుంబంలో మూడోతరం కూడా ఈ గొప్ప సంకల్పాన్ని ముందుకుతీసుకెళ్లాలని.. ఇందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏపీ సీఎం చంద్రబాబుతో పోటీ పడతానని రేవంత్ అన్నారు. చంద్రబాబు రోజూ 18 గంటలు పనిచేస్తుంటే.. తాను 12 గంటలు మాత్రమే పనిచేస్తే సరిపోదని వ్యాఖ్యానించారు. తెలంగాణరాష్ట్ర నేతలు, అధికారులు కూడా 18 గంటలు పనిచేయాల్సిందేనని అన్నారు. అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు పోటీపడాలని, ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బసవతారకం ట్రస్ట్ బోర్డు సభ్యులు, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, విశాఖ ఎంపీ యం భరత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ బాలకృష్ణ తన పుట్టినరోజును పురస్కరించుకుని కేక కట్‌చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



**వర్షాలు కురవాలని వరదపాశం**

*ములుగు జిల్లా ములుగు మండలం కొత్తూరులోని దేవుడిగుట్టపై గ్రామస్థులు శనివారం వరద పాశం నిర్వహించారు. వర్షాలు కురవాలని వేడుకుంటూ గుట్టపై తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న లక్ష్మీనర్సింహస్వామి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాల్లోని బండలపై పాశం పోయగా, భక్తులు నోటితో నాకారు.*

*– ములుగు రూరల్*

## బేవరేజెస్ జీఎం బదిలీకి బ్రేక్!

మొదటిపేజీ తరువాయి...

బదిలీ చేస్తే ఊరుకునేది లేదని తెగేసి చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ పెద్దల కమీషన్ తప్పును ఆయనపై నెట్టొద్దని, కార్పొరేషన్ పద్ధతి ప్రకారమే అనుమతులు ఇచ్చిందని మంత్రికి విన్నవించినట్టు తెలిసింది. ఆ కంపెనీల రాక వెనుక ఉన్న వ్యక్తులు కమీషన్ల వ్యవహారం మాట్లాడుకొని.. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో దానిని అధికారులపై నెట్టడాన్ని తీవ్రంగా తప్పుబట్టినట్టు తెలిసింది. బేవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహాంను తొలగిస్తే ఉద్యోగులంతా మద్యం డిపోల్లోనే ఉద్యమాలు చేయాల్సి వస్తుందని సున్నితంగా హెచ్చరించినట్టు తెలిసింది.

అడ్డం తిరిగిన ఉద్యోగులు

రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్‌లో జనరల్ మేనేజర్‌గా అబ్రహంపై బీఆర్‌ఎస్ మద్దతుదారు అనే ముద్రవేసి, ఇటీవల జరిగిన తతంగాన్నంతా ఆయనపై నెట్టాలని కొందరు ప్రభుత్వ పెద్దలు పథకం రచించారు. ఆ ప్రభుత్వ పెద్దలు.. కార్పొరేషన్‌లో కమీషన్లు ఎక్కువగా ఇచ్చిన కంపెనీలకు అనుమతులు ఇప్పించారు. కథ అడ్డం తిరగడంతో జీఎం, మరో దశలో కమిషనర్‌పై కూడా బదిలీ వేటు వేయాలని ప్రయత్నించారు. వారి స్థానంలో బ్రూవరీస్ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం నేతల్లో ఒకరిని నియమించాలని చూశారు. ఈ తంతంగాన్ని గమనించిన ఉద్యోగులు నేరుగా మంత్రిని కలిసి, వారి బదిలీలు నిలిపివేయించడంతోపాటు.. తమకున్న సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు. బేవరేజ్ కార్పొరేషన్‌లో 280 మంది ఉద్యోగులు పనులు చేయాల్సిన చోటా 104 మంది రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడుతున్నారు. ప్రత్యక్షంగా 1800 వందల మంది హమాలీ కార్మికులు, వీరితోపాటు ఐదు వేల కుటుంబాలకు కార్పొరేషన్ పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్నది. వెంటనే తమ సమస్యలకు సరైన పరిష్కారం చూపాలని ఉద్యోగులు, కార్మికులు మంత్రిని కోరినట్టు తెలిసింది.

## రుణమాఫీ సంబరాలు నిర్వహించండి

**కార్యకర్తలకు టీపీసీసీ నేత మహేశ్‌కుమార్ పిలుపు**

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు నిర్వహించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలు తీయాలని, విలేకరుల సమావేశాలు నిర్వహించి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపాలని కార్యకర్తలకు సూచించారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. 'ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. ఇది చారిత్రాత్మకమైన నిర్ణయం. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే అమలు చేస్తుంది. అప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుపైనా, ఇప్పుడు రుణమాఫీపైనా మాట నిలబెట్టుకున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తాం' అని పేర్కొన్నారు.

## సునీతా విలియమ్స్ రిటర్న్ జర్నీ మళ్లీ వాయిదా

- ఇంకా అంతరిక్ష కేంద్రంలోనే నిరీక్షణ
- జూలై 2న భూమిపైకి తిరిగొచ్చే అవకాశం

వాషింగ్టన్, జూన్ 22: భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ ప్రయాణించిన వ్యోమనౌకలో మళ్లీ సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఆమె అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయారు. జూన్ 5న ఆమె ప్రయాణించిన ఐఎస్‌ఎస్ అంతరిక్ష నౌక బోయింగ్ స్టార్ లైనర్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్‌ఎస్)కు చేరుకుంది. జూన్ 14న సునీతతో పాటు ప్రయాణిస్తున్న విల్‌మోర్ భూమికి తిరుగు ప్రయాణం కావాల్సి ఉంది. అయితే స్టార్ లైనర్‌లో వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తయ్యాయి. దీంతో భూమిపై ల్యాండింగ్‌ను వాయిదా వేశారు. సునీత, ఆమె సహచరులు ఈ నెల 26న తిరుగు ప్రయాణం కానున్నట్లు నాసా ప్రకటించగా.. ఇప్పుడు మరోసారి వాయిదా పడింది. అయితే అన్నీ అనుకూలిస్తే జూలై 2న వీరిద్దరూ తిరిగి భూమిని చేరుకోవచ్చని నాసా అంచనా వేస్తున్నది.

## ఇద్దరు సీఐలపై సస్పెన్షన్ వేటు

- మరో ముగ్గురు ఐజీ ఆఫీస్‌కు అటాచ్
- ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ రంగనాథ్

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ అవినీతికి పాల్పడిన సీఐలు, పోలీసులను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సత్తుపల్లి ప్రాంతంలో పేకాటరాయళ్లకు సహకరిస్తూ, జూదగృహలను ప్రోత్సహిస్తున్న సీఐ వెంకటేశంతోపాటు తప్పుడు కేసులు నమోదు చేసినందుకు ములుగు జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీధర్‌ను ఐజీ సస్పెండ్ చేశారు. మతకల్లోల సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మెదక్ పట్టణ, రూరల్ ఇన్‌స్పెక్టర్లు దిలీప్‌కుమార్, కేశవులను, పర్యవేక్షణ లోపించినందున భూపాలపల్లి జిల్లా మహాదేవాపూర్ సీఐ రాజేశ్వర్‌రావును ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. సత్తుపల్లి రూరల్ సీఐ వెంకటేశం పేకాటరాయుళ్లకు సమాచారం ఇస్తూ వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నాడు. 2022-23లో ఖమ్మం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన శ్రీధర్ ఓ సివిల్ తగాదాలో తలదూర్చి ఓ ప్రతికా విలేకరి ఇంట్లో ఎస్‌ఎల్‌ఆర్ తుపాకీకి చెందిన ఆరు తూటాలు లభ్యమైనట్లు ఆయుధాల చట్టంతోపాటు పలు సెక్షన్లతో బెదిరించి తప్పుడు కేసు నమోదు చేశాడు. ఖమ్మం సీపీ విచారణలో అది నిజమని తేలడంతో ఆయనను సస్పెండ్ చేశారు. ఇప్పుడాయన ములుగు ఎస్పీలో సీఐగా ఉన్నాడు.

## పీఎస్‌పై ఏసీబీ రైడ్.. పారిపోయిన ఎస్సై

- ఓ వ్యక్తికి స్టేషన్ బెయిలు ఇచ్చేందుకు లంచం డిమాండ్
- డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై తరఫు వ్యక్తి రాజు
- ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి వివరాల వెల్లడి



ఎస్సై అజయ్

రాయికల్, జూన్ 22: రాయికల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై తరఫున ఓ వ్యక్తి ఇసుక ట్రాక్టర్ యజమాని నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కగా.. ఎస్సై స్టేషన్ నుంచి పారిపోయాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జగిత్యాల జిల్లా రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. శనివారం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, బాధితుడు రాజేందర్‌రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. రాయికల్ మండలం ఇటిక్యాలకు చెందిన రాజేందర్‌రెడ్డి పశువుల దొడ్డి నిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన వాగు నుంచి ఈ నెల 11న ట్రాక్టర్ ద్వారా ఇసుకను తీసుకొస్తున్నాడు. రాయికల్ పోలీసులు పట్టుకొని పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు రావాల్సిందిగా రాజేందర్‌కు రాయికల్ ఎస్సై అజయ్ తన సిబ్బంది ద్వారా సమాచారం అందించాడు. బాధితుడు స్టేషన్‌కు వెళ్లి ఎస్సైని కలువగా.. ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదైందని, ట్రాక్టర్‌ను విడిచిపెట్టడానికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంత పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వలేనని బాధితుడు రాజేందర్‌రెడ్డి వేడుకోగా.. రూ.30 వేలు ఇస్తేనే పని జరుగుతుందని ఎస్సై గట్టిగా చెప్పాడు. చేసేది లేక బాధితుడు మొదటగా రూ.15 వేలు ఇచ్చాడు. మిగతా రూ.15 వేలు ఇస్తేనే స్టేషన్ బెయిల్ ఇచ్చి ట్రాక్టర్‌ను వదులుతామని చెప్పడంతో రూ.5 వేలు ఇస్తానన్నాడు. రూ.10 వేలు ఇవ్వాల్సిందేనని ఎస్సై తేల్చి చెప్పగా.. రాజేందర్‌రెడ్డి ఏసీబీని ఆశ్రయించాడు. ఈ మేరకు రాజేందర్‌రెడ్డి రూ.10 వేలు ఇస్తానని శుక్రవారం ఎస్సైకి ఫోన్ చేయగా.. తాను అందుబాటులో లేనని, స్టేషన్ దగ్గర తన మనిషి రాజు ఉన్నాడని, అతనికి ఇవ్వాలని చెప్పడంతో ఇచ్చాడు. వెంటనే ఏసీబీ అధికారులు ఎస్సై తరఫున డబ్బులు తీసుకున్న రాజును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ తర్వాత ఎస్సైని పట్టుకునేందుకు ఏసీబీ అధికారులు రాయికల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా.. వారిని గమనించిన ఎస్సై అజయ్ స్టేషన్ గోడ దూకి పరారయ్యాడు. దీంతో రాజును అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చినట్టు, పరారీలో ఉన్న ఎస్సై అజయ్‌పై కేసు నమోదు చేసినట్టు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.